స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన



స్వచ్ఛతపై విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న ఎంఈవో హరిశ్చందర్

ఓల్డుబోయినపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బాలానగర్ మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఓల్డుబోయినపల్లి డివిజన్ హస్మత్‌పేటలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమంగా ప్రారంభించిన స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం పారిశుధ్యం, ప్రజారోగ్యం పట్ల పరివర్తనాత్మక మార్పులను ప్రతిబింబింపచేస్తుందన్నారు. 17 అక్టోబరు నుంచి 31 అక్టోబరు వరకు నిర్వహించే స్వచ్ఛత కార్యక్రమాలలో విద్యార్థును భాగస్వామ్యులను చేసి స్వచ్ఛత పట్ల సంపూర్ణమైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో భాగంగా బాలానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించి స్వచ్ఛత పక్వాడ, రాబోయే ఎస్ఏ 1 పరీక్షలు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ హైస్కూల్ హెచ్ఎం అరుణ్‌జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బేకరీ ప్రారంభోత్సవం



కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ పిల్లర్ నంబర్ ఏ-753 వద్ద ఫణివర్ధన్, గౌతమ్‌లు ఏర్పాటు చేసిన భవాని బేకరీని శుక్రవారం ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి.
- నిజాంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి)

మాగంటి సునీతను గెలిపించాలి



కారు గుర్తుకు ఓటు వేయాలని ముస్లింలను అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ఓల్డుబోయినపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎర్రగడ్డలోని మసీదులలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఖాజా, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



బాణసంచా దుకాణంలో కొనుగోలుదారులు

మార్కెట్‌లో దీపావళి సందడి

- ఊపందుకున్న ప్రమిదలు, స్వీట్ల విక్రయాలు
- కొనుగోలుదారులతో రద్దీగా మారిన దుకాణాలు

బాలానగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి మరో మూడు రోజులు మాత్రమే ఉండడంతో రోడ్ల పక్కన ఎక్కడ చూసినా మట్టితో చేసిన ప్రమిదలు, దొంతులు దర్శనమిస్తున్నాయి. గోరంత దీపం కొండంత వెలుగు అని మన పెద్దలు చెప్పిన మాటలను మర్చిపోయినప్పటికీ దీపావళి రోజు మాత్రం నగర వాసులు దీపాలను తప్పక గుర్తు చేసుకుంటున్నారు. పండుగ నేపథ్యంలో ఓ వైపు బాణసంచా దుకాణాలు, మరోవైపు మట్టి ప్రమిదల అమ్మకాలతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో సందడి వాతావరణం నెలకొంది. నగరంలోని కుమ్మరి వాడలకు చెందిన కళాకారులతో పాటు రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన కుమ్మరులు తయారు చేసిన ప్రమిదలు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ కళాకారులు టెర్రకోట మట్టితో తయారు చేసిన ప్రమిదలను వ్యాపారులు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఒక వత్తి, రెండు వత్తులు, ఐదు వత్తులు వెలిగించే విధంగా తయారు చేసిన ప్రమిదలు ఇక్కడ దర్శన మిస్తున్నాయి. డజను రూ.50 నుంచి వంద వరకు వ్యాపారులు విక్రయిస్తుండడంతో మహిళలు తమకు నచ్చిన ప్రమిదలను వ్యాపారుల వద్ద బేరమాడి కొనుక్కుంటున్నారు. రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద ప్రమిదలు కొనేందుకు మహిళలు తమ కుటుంబ సభ్యులతో కలిసి వస్తుండడంతో మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది.

బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

బాలానగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని బాలానగర్ సీఐ టి.నర్సింహరాజు సూచించారు. శుక్రవారం బాలానగర్ సెక్టార్ ఎస్సై వినోద్‌కుమార్‌తో కలిసి బాలానగర్‌లో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలను తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనుమతి లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే పేలుడు పదార్థాల చట్టం కింద కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. దుకాణాలను ఖాళీ స్థలాలలో, కల్యాణ మండపాలలో ఏర్పాటు చేసుకుని యజమానుల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలన్నారు. ప్రతి దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు అనుమతి లేదని, ఒక్కో ప్రాంతంలో కేవలం 50 దుకాణాలు మాత్రమే ఉండాలన్నారు. దుకాణాల వద్ద అనుకోని అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎదుర్కొనేందుకు అవసరమైన అగ్నిమాపక పరికరాలు, డ్రమ్ముల్లో నీరు, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



బాణసంచా దుకాణాల నిర్వాహకులకు సూచనలు చేస్తున్న సీఐ నర్సింహరాజు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్ మహేందర్

కూకట్‌పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చైతన్య బస్తీలో రూ.20లక్షల నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులను శుక్రవారం మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ప్రారంభించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

యువతి అదృశ్యం



హాసిక

హైదర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో నివాసం ఉంటున్న యువతి అదృశ్యమైన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ సమీపంలో లేడీస్ హాస్టల్‌లో ఉంటున్న హాసిక ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుంది. కాగా ఎస్ఆర్‌నగర్‌లో ఉండే ఆమె సోదరుడు ప్రశాంత్ శుక్రవారం ఉదయం హాస్టల్ వద్దకు వచ్చి ఫోన్ చేయగా కిందకు వస్తానని హాసిక చెప్పింది. ఎంతకూ రాకపోవడంతో హాస్టల్‌లో విచారించగా ఈ నెల 16 నుంచి ఆమె హాస్టల్‌లో లేదని చెప్పారు. ఆ తర్వాత ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ సంఘాల బంద్‌కు సంపూర్ణ మద్దతు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నేడు నిర్వహించే బీసీ సంఘాల ఐక్య వేదిక బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి వాసులు కూడా పూర్తి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

కూకట్‌పల్లి జనసేన మద్దతు..

హైదర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నేటి రాష్ట్ర బంద్‌కు కూకట్‌పల్లి జనసేన పార్టీ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మద్దతు ఇచ్చినట్లు రాష్ట్ర సభ్యుడు తెల్ల హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు జనసేన కార్యకర్తలు బంద్‌లో పాల్గొని మద్దతు ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాకేష్, కేవీ శివరాం, శంకర్, వేముల మహేష్, ప్రసాద్, శ్రీనివాస్, సుబ్బు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనుల పరిశీలన

హైదర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్‌లో జరుగుతున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ మొదటి అంతస్తు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పీజేఆర్‌నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు, ప్రహరీ గోడ పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రహరీ నిర్మాణం కోసం తవ్వకాలు జరుగుతున్న సమయంలో పగిలిన మంజీరా వాటర్ పైపులైన్‌కు వెంటనే మరమ్మతులు చేసి తాగునీరు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని జలమండలి అధికారులను కోరారు. పీజేఆర్‌నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరతుందని, అందరికీ ఆమోదయోగ్యమైన ఫంక్షన్‌హాల్‌ను సకల సౌకర్యాలతో నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, జి.రవి, సీహెచ్ భాస్కర్, అగ్ర వాసు, బాలస్వామి, పి.మహేష్, ప్రభాకర్, చంద్రయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఏడాదికోసారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెట్టి కుసుమకుమార్

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారైనా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కేజీఎఫ్ వ్యవస్థాపకుడు జెట్టి కుసుమ కుమార్ అన్నారు. ఈ మేరకు కేపీహెచ్‌బీ సర్దార్‌పటేల్‌నగర్‌లో శుక్రవారం మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 300 మందికి పరీక్షలు చేయగా ఇద్దరికి రొమ్ము, ఒకరికి లంగ్ క్యాన్సర్ నిర్ధారణ, మరో 10 మందికి క్యాన్సర్ లక్షణాలు ఉండటంతో తదుపరి పరీక్షల కోసం బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు క్యాంపు నిర్వాహకుడు సాయిబాబు చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు భానుప్రసాద్, రాఘవేందర్‌రావు, ఎస్ఆర్ మోటార్స్ శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో దీపావళి సందడి

- ఊపందుకున్న ప్రమిదలు, స్వీట్ల విక్రయాలు
- కొనుగోలుదారులతో రద్దీగా మారిన దుకాణాలు

ఖేల్‌కాలనీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): 'చీకటి వెలుగుల రంగేళీ జీవితమే ఒక దీపావళి' అని మహాకవి మానవ జీవితాన్ని దీపావళితో పోల్చారు. ఏడాదికోమారు వచ్చే పండుగల్లో దేశవ్యాప్తంగా అత్యంత ఘనంగా జరుపుకునే పండుగ దీపావళి. చిన్న పెద్ద, బీద గొప్ప తేడా లేకుండా ఆనందంగా జరుపుకునే దీపావళి పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, ప్రతీ ఇంటిలో వెలుగులను నింపే జ్యోతులు, ప్రమిదలు, ఇంటింటా జరుపుకునే పేరంటాల్లో కొలువుదీరే లక్ష్మీదేవి విగ్రహాలు విక్రయాలకు సిద్ధమయ్యాయి. ప్రజలందరూ సంతోషంగా జరుపుకునే దీపావళి మూడు రోజులు మాత్రమే ఉండడంతో మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది. కొనుగోలుదారులతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. శేరిలింగంపల్లి, చందానగర్, బీహెచ్‌ఈఎల్, మియాపూర్, గచ్చిబౌలి తదితర ప్రధాన ప్రాంతాల్లో మట్టి ప్రమిదలు, కుండలు, విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి.

నోరూరించే పంచదార చిలకలు..

దీపావళి అంటేనే మిఠాయిల పండుగ. మిఠాయిలతో పాటు దీపావళికి ప్రత్యేకంగా పంచదారతో తయారు చేసే చిలకలు, పంచదార బొమ్మల కొనుగోళ్లు అధికంగా జరుగుతుంటాయి. పండుగ నేపథ్యంలో పంచదార మిఠాయిల విక్రయాలు ఊపందుకున్నాయి. కిలో రూ.150 నుంచి రూ.250 వరకు విక్రయాలు జరుగుతుండగా, ప్రజలు విభిన్న మిఠాయిలను కొనుగోలు చేస్తున్నారు. లింగంపల్లి ప్రధాన మార్కెట్‌తో పాటు స్వీట్ దుకాణాల్లో పంచదార మిఠాయిల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి.


అమ్మకానికి ఉంచిన నోరూరించే మిఠాయిలు

మట్టి ప్రమిదలే శ్రేష్ఠం..

ప్రకృతి సిద్ధమైన మట్టితో తయారు చేసిన ప్రమిదల్లో జ్యోతులను వెలిగించడమే శ్రేష్టమని వేదాలు ఘోషిస్తుండగా, కళ్లకు ఎటువంటి హాని కలిగించని మట్టి ప్రమిదలే మంచివని వైద్యులు సూచిస్తున్నారు. మట్టితో తయారు చేసిన ప్రమిదల్లో దీపాలను వెలిగించడం వల్ల వెలువడే కాంతి కళ్లకు హాని చేయదని, మట్టిలో నూనె కాలడం వల్ల వెలువడే కాంతులకు క్రిములు నశిస్తాయని చెబుతున్నారు. రంగురంగుల ప్రమిదలపై వేసే రసాయనాలు కలుషిత వాతావరణం సృష్టిస్తాయని, చర్మ వ్యాధులు, కళ్ల జబ్బులు, గొంతు, శ్వాశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదముందని నిపుణులు పేర్కొంటున్నారు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు, కుండలు


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనుల పరిశీలన

హైదర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్‌లో జరుగుతున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ మొదటి అంతస్తు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పీజేఆర్‌నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు, ప్రహరీ గోడ పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రహరీ నిర్మాణం కోసం తవ్వకాలు జరుగుతున్న సమయంలో పగిలిన మంజీరా వాటర్ పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతులు చేసి తాగునీరు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని జలమండలి అధికారులను కోరారు. పీజేఆర్‌నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరతుందని, అందరికీ ఆమోదయోగ్యమైన ఫంక్షన్‌హాల్‌ను సకల సౌకర్యాలతో నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, జి.రవి, సీహెచ్ భాస్కర్, అగ్ర వాసు, బాలస్వామి, పి.మహేష్, ప్రభాకర్, చంద్రయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.


బంద్‌కు మద్దతివ్వాలని ముమ్మారెడ్డిని కోరుతున్న బీసీ సంఘాల నాయకులు

బీసీ సంఘాల జేఏసీ బంద్‌కు కూకట్‌పల్లి జనసేన మద్దతు

హైదర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు శనివారం జరగబోయే రాష్ట్ర బంద్‌కు కూకట్‌పల్లి జనసేన పార్టీ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మద్దతు ఇచ్చినట్లు రాష్ట్ర సభ్యుడు తెల్ల హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు జనసేన కార్యకర్తలు బంద్‌లో పాల్గొని బీసీ సంఘానికి మద్దతు ఇవ్వాలని అయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, కేవీ శివరాం, జనసేన నాయకులు శంకర్, వేముల మహేష్, ప్రసాద్, శ్రీనివాస్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను శాంతియుతంగా నిర్వహించాలి

చందానగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం బీసీ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని ఇన్‌స్పెక్టర్ విజయ్ తెలిపారు. బంద్‌ను శాంతియుతంగా నిర్వహించాలని, ప్రజల ఆస్తులకు ఎలాంటి నష్టం కలిగించినా, శాంతిభద్రతలకు ఇబ్బందులు కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


మహాపాదయాత్ర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, గంగాధర్‌రెడ్డి


అయ్యప్పస్వాములతో పటాన్‌చెరువు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

శబరిమలకు మహాపాదయాత్ర ప్రారంభం

రాయదుర్గం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో శబరిమల మహాపాదయాత్ర ప్రారంభోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, ఉప్పపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై మహాపాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు. అనంతరం స్వాములకు భిక్ష వడ్డించారు. కార్యక్రమంలో సీనినియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డి, అయ్యప్ప మాలధారులు, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భెల్‌టౌన్‌షిప్‌లో..

ఖేల్‌కాలనీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ అయ్యప్పస్వామి దేవాలయం నుంచి శబరిమల అయ్యప్ప దేవాలయం వరకు అప్పయ్యస్వాములు చేపట్టిన మహాపాదయాత్ర కోసం శుక్రవారం ఉదయం భెల్‌టౌన్‌షిప్‌లోని అయ్యప్ప ఆలయంలో స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరువు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కఠోర దీక్షతో శబరిమల వరకు పాదయాత్ర చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు.

కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

చందానగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ శివాజీనగర్ కట్టమైసమ్మ అలయంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, హోమాలు, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉరిటి వసుంధర వెంకట్రావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


పుష్పాలంకరణలో కట్టమైసమ్మ తల్లి

లక్ష్మీగణపతి ఆలయంలో..

చందానగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ శిల్పాఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, హోమం నిర్వహించి సిద్ధి బుద్ధి సమేత లక్ష్మీగణపతి స్వామికి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారిని ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ యు.వి.రమణమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల బంద్‌ను విజయవంతం చేయాలి

హైదర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి సీపీఎం కార్యాలయంలో బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం సీపీఐ శాఖ కార్యదర్శి మనోచారి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జి.కృష్ణ హాజరయ్యారు. వారితో పాటు బీసీ వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాసెట్టి నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని, బీసీల హక్కుల గురించి ఎన్నో ఏళ్ల నుంచి పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు బీసీల పట్ల మొండి వైఖరి అవలంబిస్తున్నాయని, ఇప్పటికైనా పాలకులు బీసీల పట్ల శ్రద్ధ వహించి పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని కోరారు. శనివారం జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. జగన్, దేవదానం, చిలక ప్రకాష్, చంద్రమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జి.కృష్ణ

జిల్లా గణేష్ విజ్ఞప్తి..

హైదర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ బీసీ జేఏసీ ఆదేశానుసారం ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్‌లో సీనియర్ నాయకులు జిల్లా గణేష్‌కుమార్‌యాదవ్, ఏకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులు, సంఘాల నాయులను కలిసి బీసీ సంఘాలకు మద్దతు తెలిపి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. శివశంకర్, వెంకటనర్సింగరావు, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతల్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడేనా?

- నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో నిలిచిపోతున్న ట్రాఫిక్
- గంటల తరబడి రోడ్లపైనే వాహనదారులు
- యూటర్న్ మార్పుతో పాటు ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు నిర్మించాలని కోరుతున్న ప్రజలు


చింతల్ నుంచి షాపూర్‌నగర్ వెళ్లే రోడ్డుపై ట్రాఫిక్ జామ్


బాలానగర్ నుంచి చింతల్ వైపు వెళ్లే రోడ్డుపై నిలిచిన వాహనాలు

కుత్బుల్లాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చింతల్ ప్రధాన రహదారి ట్రాఫిక్ జామ్‌కు ప్రధాన కేంద్రంగా మారింది. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో కిలో మీటర్ దూరమున్న ఈ రోడ్డుపై నిత్యం గంటల తరబడి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రతిరోజూ వాహనాలు నిలిచిపోయి పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ప్రధానంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం చౌరస్తా నుంచి హ్యాపీ చిల్డ్రన్స్ ఆస్పత్రి వరకు, చింతల్ బస్టాండ్ నుంచి లెమన్ రిడ్జ్ టవర్స్ వరకు, బాలానగర్ వైపు నుంచి వచ్చే డీమార్ట్ నుంచి ఐడీపీఎల్ చౌరస్తా, సాయినగర్ నుంచి చింతల్ బస్టాండ్ వరకు ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఈ సమయాల్లో ఎవరైనా అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రికి వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సిందే. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన అధికారులు అక్కడికి వచ్చి చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నప్పటికీ వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో అడ్డుకట్ట వేయడం కష్టతరంగా మారింది. చింతల్ హ్యాపీ చిల్డ్రన్స్ ఆస్పత్రి వద్ద, షా థియేటర్ వద్ద పాదచారులు రోడ్డు దాటేందుకు ఏర్పాటు చేసిన సిగ్నళ్ల వద్ద ఈ సమస్య తీవ్రంగా ఉంది. అయితే ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు ఏర్పాటు చేస్తే ఈ ట్రాఫిక్ సమస్య నుంచి పాదచారులకు కాస్త ఉపశమనం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతే కాకుండా చింతల్‌లోని కాకతీయనగర్, శ్రీనివాస్‌నగర్, మాణిక్యనగర్ తదితర ప్రాంతాలకు చెందిన వాహనదారులు షాపూర్‌నగర్ వైపు వెళ్లాలంటే ఐడీపీఎల్ సమీపంలోని లెమన్ రిడ్జ్ టవర్స్ వరకు.. ఒక కిలో మీటర్ దూరం వెళ్లి యూటర్న్ చేయడం వల్ల సమయం వృథా అవుతోందని, మాంగళ్య షాపింగ్ మాల్ ఎదురుగా యూటర్న్ సౌకర్యం కల్పిస్తే ట్రాఫిక్ సమస్యకు కాస్త చెక్ పెట్టే అవకాశముందని స్థానికులు అంటున్నారు.


పూజల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దంపతులు

కొంపల్లికి చేరుకున్న 'ధర్మ విజయ యాత్ర'

కుత్బుల్లాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణ, ప్రచారం, ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించడమే లక్ష్యంగా శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్మ విజయ యాత్ర శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లిలోని ఎన్‌సీఎల్ కాలనీ వరకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించి స్వాగత సేవకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దంపతులు, ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి హాజరయ్యారు. వారికి విధుశేఖర భారతీ మహాస్వామి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో రాచర్యల హైందవి రవిచంద్రశర్మ, కొంపల్లి మాజీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శిరీష ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న కొలన్ హన్మంత్‌రెడ్డి తదితరులు

ఘనంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన

నిజాంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట గ్రామంలోని శివాజీనగర్ కాలనీలో శ్రీఎల్లమ్మ పోచమ్మ ఆలయంలో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. మాజీ కార్పొరేటర్ ఆవుల పావనీజగన్ యాదవ్, ఆవుల పరశురాం యాదవ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో నిజాంపేట అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం

నిజాంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేటలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి 14 రోజుల పాటు అయ్యప్ప స్వాములైన ఏనుగుల శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం మొదలు పెట్టారు. గురుస్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి , ఏనుగుల మాధవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సత్తిరెడ్డి , అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

బేకరీ ప్రారంభోత్సవం

కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ పిల్లర్ నెంబర్ ఏ-753 వద్ద ఫణివర్ధన్, గౌతమ్‌లు ఏర్పాటు చేసిన భవాని బేకరీని శుక్రవారం ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి.


- నిజాంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి)

మతిస్థిమితం సరిగా లేని యువకుడి అదృశ్యం

●కుమారుడి ఫొటోతో తల్లి గాలింపు


కుమారుడి ఫొటో పట్టుకొని తిరుగుతున్న తల్లి పద్మ

జీడిమెట్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి : మతిస్థిమితం సరిగా లేని యువకుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పోలీసుల కథనం ప్రకారం.. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని మైసమ్మ నగర్, బీ-బ్లాక్‌కు చెందిన పద్మ కుమారుడు పల్లెపు నగేష్ (25)కు మతిస్థిమితం సరిగా ఉండదు. 15 రోజుల క్రితం ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయాడు. దీంతో తల్లి కుమారుడు ఫొటో పట్టుకొని వీధి వీధిలో గాలిస్తోంది. ఈ నెల 1న ఏపీలోని రాయలసీమలో గల మల్లెల గ్రామంలో ఉంటున్న కుమార్తె వద్దకు నగేశ్‌ను తీసుకొని తల్లి పద్మ వెళ్లింది. అయితే 3వ తేదీన నగేష్ నగరంలోని ఇంటికి రాగా, 4 తేదీని ఊరు నుంచి తల్లి వచ్చింది. కుమారుడు ఇంటి వద్ద లేకపోవడంతో స్థానికులను ఆరా తీయగా, అదే రోజు తన ద్విచక్ర వాహనాన్ని తీసుకొని బయటకు వెళ్లాడని తెలిపారు. దీంతో తన కుమారుడి ఆచూకీ కనుగొనాలని కోరుతూ, తల్లి పద్మ శుక్రవారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి'

షాపూర్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్ర జ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించే బీసీ బంద్‌ను జయప్రదం చేయాలని రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు గూడ ఐలయ్యగౌడ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం సూరారంలోని అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ప్రజా సంఘాల సమావేశం దళిత సంఘాల ఐక్యవేదిక కమిటీ ప్రధాన కార్యదర్శి హనుమకొండ ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఐలయ్యగౌడ్ మాట్లాడుతూ, బంద్‌లో అందరూ పాల్గొని బీసీ కులాల ఉద్యమ సత్తాను చాటుదామన్నారు. దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బూదాల అమర్‌బాబు, అఖిల భారత రాష్ట్రీయ దళిత సేన అధ్యక్షుడు అవిజే జేమ్స్, నాయకులు ఆర్. సిద్ధయ్య, బీసీ సంఘాల నాయకులు ఎం. జనార్దన్, భూదాల ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల గేటుకు తాళం.. విద్యార్థుల ఆందోళన

కుత్బుల్లాపూర్, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి) : చింతల్‌లోని కె. వెంకన్న జూనియర్ కళాశాలలో సుమారు 100 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దసరా సెలవులకు సొంతూళ్లకు వెళ్లిన విద్యార్థులు శుక్రవారం తిరిగి వచ్చే సరికి కళాశాల గేటుకు తాళం వేసి ఉంది. దీంతో ఆందోళనకు గురైన విద్యార్థులు యాజమాన్యానికి ఫోన్ చేయగా, విద్యుత్ సమస్యలతో పాటు ఇతర మరమ్మతులు ఉన్నాయని, దీపావళి అనంతరం కళాశాలకు రావాలని చెప్పడంతో కళాశాల ముందు విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఇలా ఉండగా, అద్దె చెల్లించక పోవడంతో కళాశాల భవనానికి యజమాని తాళం వేశాడని స్థానికులు చెప్తున్నారు. తమన ఇబ్బందులకు గురిచేసిన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి: ఎమ్మార్పీఎస్

గాజులరామారం,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ సుజాతకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాలతో ఎమ్మార్పీఎస్ నాయకులు ముందుగా మండల కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు రాసమల్ల యాదగిరి, అధికార ప్రతినిధి సిల్వర్ శ్రీనివాస్, జిల్లా మాదిగ మహిళా అధ్యక్షురాలు నడిమిదొడ్డి సలోమి తదితరులు పాల్గొన్నారు.


జీడిమెట్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఎస్ఆర్ నాయక్‌నగర్‌కు బస్సులను పునరుద్ధరించాలి

జీడిమెట్ల,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్‌నగర్ కాలనీకి ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే బస్సులను పునరుద్ధరించాలని జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులుకు కాలనీవాసులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కొంత కాలంగా క్రితం రోడ్డు తవ్వి వదిలేయడంతో బస్సులు నడపలేమని అధికారులు నిలిపివేశారన్నారు. రోడ్డుకు ఇటీవల మరమ్మతులు చేసినా బస్సులను మళ్లీ ఎందుకు నడపడం లేదని మేనేజర్‌ను ప్రశ్నించారు. తప్పకుండా పరిశీలించి బస్సులను నడుపుతామని మేనేజర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏవీ శేషాచారి, ఎం. సోమేశ్వరరావు, సీహెచ్.శ్యామ్ పాల్గొన్నారు.

నేడు జీడిమెట్ల పీఎస్‌లో మెగా రక్తదాన శిబిరం

జీడిమెట్ల,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా శనివారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామని సీఐ గడ్డం మల్లేష్ తెలిపారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్‌మహంతి, బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ చేతుల మీదుగా ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ఇప్పటికే రక్తదానం చేయడానికి 600 మంది యువత తమ పేర్లు నమోదు చేసుకున్నారని, వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 300 యూనిట్ల రక్తం సేకరించాలని ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, సేకరించిన రక్తాన్ని నిమ్స్, తలసేమియా బాధితులకు అందిస్తామని సీఐ గడ్డం మల్లేష్ తెలిపారు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈశిబిరం కొనసాగుతుందన్నారు. రక్తదాతలకు ప్రోత్సాహక బహుమతి అందించనున్నట్టు సీఐ తెలిపారు. రక్తదానం చేయాలనుకున్న వారు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన సూచించారు.